క్లుప్తంగా

మాజీ మంత్రి వేణు పరామర్శ



పట్టాభిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు

కడియం: పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు శాక పట్టాభిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం పరామర్శించారు. కడియంలో ఆయన స్వగృహానికి వెళ్లి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వేణు వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఈలి గోపాలం తదితరులు ఉన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

కడియం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి రమ్యశ్రీ వైద్య ఖర్చుల కోసం వెలుగుబంటి యూత్ ఆధ్వర్యంలో రూ.5 వేలు అందజేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ చేతుల మీదుగా గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

సరస్వతి పుష్కరాలకు రెండు బస్సులు



పుష్కరాలకు బయలుదేరుతున్న బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు గురువారం రాజమహేంద్రవరం డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు భక్తులతో బయలుదేరాయి. వీటిని డిపో మేనేజర్ షేక్ షబ్నం జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ బస్సులు ధర్మపురి, కాళేశ్వరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, రామప్ప క్షేత్రాలను దర్శించిన అనంతరం 25వ తేదీన డిపోకు చేరుకుంటాయన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి 12.30 గంటల వరకూ ఆల్కాట్ గార్డెన్స్ ఏరియా, ఐఎల్‌టీడీ జంక్షన్, శంభూనగర్, స్వరాజ్య నగర్, అంబికా నగర్ తదితర ఏరియాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

నర్సరీని సందర్శించిన ఎస్పీ



ఎస్పీ కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు, కొత్తపల్లి బ్రదర్స్

కడియం: మండలంలోని బుర్రిలంక గ్రామంలోని ఉమా పార్వతి నర్సరీని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో కొత్తపల్లి బ్రదర్స్ ప్రత్యేకంగాసృష్టించి పెంచిన 'టాల్ బోన్సాయ్' అనే 100 సంవత్సరాల వయసు ఉన్న వృక్షజాతి మొక్కను ఎలా తయారు చేశారో, దాని పెంపకానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వృక్షజాతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలు, అనంతరం వాటి పెంపకం గురించి కూడా ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ దేశానికి, పర్యావరణానికి కడియం నర్సరీ రైతుల చేస్తున్న సేవలు చాలా విలువైనవన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

అరకు అరోమా కాఫీ కార్పొరేట్ ఆఫీసు ప్రారంభం



ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ: గోకవరం బస్టాండ్ సమీపంలోని శ్రీలత హాస్పిటల్ 4వ అంతస్తులో డాక్టర్ అనుసూరి ప్రియాంక, బి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అరకు అరోమా కాఫీ కార్పొరేట్ ఆఫీస్‌ను గురువారం డాక్టర్ అనుసూరి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీఐసీసీ మాజీ చైర్మన్ శివ రామ సుబ్రహ్మణ్యం, కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ రామరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి.. అరోమా ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ అరకు అరోమా కాఫీ ఉత్పత్తుల విశిష్టతను వివరించారు. ఈ కార్పొరేట్ ఆఫీస్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచేజీలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు డాక్టర్ కర్రి రామారెడ్డి, క్రెడాయి రాష్ట్ర చైర్మన్ బుడిగ శ్రీనివాస్, డాక్టర్ పద్మలత అనుసూరి, దేశిరెడ్డి బలరాం నాయుడు పాల్గొన్నారు.

జీతాలకు బ్రేక్..

- తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు అందని వేతనాలు
- మూడు నెలలుగా రాక ఇబ్బందులు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



జీతాల కోసం నిరసన తెలుపుతున్న 102 సర్వీస్ కెప్టెన్లు

కంబాలచెరువు: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డలను క్షేమంగా వారి ఇంటికి చేర్చడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు పనిచేస్తున్నాయి. ఆ వాహనాల డ్రైవర్లు (కెప్టెన్లు) ఎంతో భద్రంగా తల్లీబిడ్డలను తీసుకువెళతారు. అలాగే రక్తహీనతతో బాధపడే గర్భిణులను ఆసుపత్రికి తీసుకురావడం, వారికి రక్తం ఎక్కించిన తర్వాత ఇంటి దగ్గర దింపే అదనపు బాధ్యతలు కూడా నెరవేర్చుతున్నారు. ఇంతలా సేవ లందిస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. కూటమి పాలకులు దాదాపు మూడు నెలలుగా 102 సర్వీస్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేదు. దీంతో వారందరూ కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి, కుటుంబాలను గడుపుకొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 13 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉండగా, వాటిలో 11 వాడుకలో ఉన్నాయి. వాటిలో నాలుగు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్నాయి. వీటి ద్వారా రాజమహేంద్రరం ప్రభుత్వాసుపత్రికి వచ్చే బాలింతలు, గర్భిణులకు ఎక్స్‌ప్రెస్ కెప్టెన్ సేవలందిస్తాడు. వీరికి చంద్రబాబు హయాంలో నెలకు రూ.7,270 చొప్పున జీవీకే సంస్థ వేతనంగా అందించేది. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి తీసుకువచ్చారు. అరబిందో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల జీతాలను రూ.8,800కు జగన్ పెంచారు.

తప్పని అవస్థలు

102 సర్వీస్ కెప్టెన్లతో సర్వీసు చేయించుకుంటున్నారే కానీ జీతాలు సరైన సమయానికి ఇవ్వడం లేదు. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయి, ప్రచారం మార్మోగుతోంది, అయితే ఉద్యోగులు మాత్రం అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఇచ్చేది అరకొర జీతాన్ని కూడా గుర్తుకొచ్చినప్పుడు ఇస్తున్నారు. ప్రస్తుతం 102 సర్వీస్ కెప్టెన్లకు జీతాలు ఇచ్చి మూడు నెలలు అవుతోంది. వీరందరూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తిస్తారు. అయితే దూర ప్రాంతాలకు పేషెంట్లను తరలించాల్సి వస్తే ఒక్కోసారి అర్ధరాత్రి దాటుతుందన్నారు. ఆ అదనపు పని వేళలకు ఫలితం ఉండదన్నారు. ఈ నేపథ్యంలో ఎనిమిది గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని 102 సర్వీస్ కెప్టెన్లు కోరుతున్నారు.

> **రూ.28 వేల జీతం ఇవ్వాలి**
>
> 
>
> 102 సర్వీస్ కెప్టెన్లకు ప్రభుత్వం ఇస్తున్న అరకొర జీతం సరిపోక, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి జీతాన్ని రూ.28 వేలకు పెంచాలి. అలాగే ప్రతి నెలా సక్రమంగా అందజేయాలి. ఇప్పటికే మూడు నెలల జీతాన్ని బకాయి పెట్టడం దారుణం. ప్రజలకు మంచి సేవలు అందాలంటే ఈ సర్వీస్‌ను ప్రభుత్వమే నేరుగా నడపాలి.
>
> – బి.పవన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అధిక రక్తపోటుతో గర్భిణులకు అనర్థాలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి కోమల

ధవళేశ్వరం: గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పోటు పరీక్ష చేయించుకోవాలని, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల అన్నారు. ప్రపంచ ప్రీ ఎక్లాంషియా (గుర్రపువాతం, గర్భవాతం)డే దినోత్సవం సందర్భంగా ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోమల మాట్లాడుతూ గర్భిణుల్లో అధిక రక్త పోటు కారణంగా ఎక్లాంషియా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కిల్కారి మొబైల్ అకాడమీ (01244451660 నంబర్)నుంచి వచ్చే కాల్స్‌ను గర్భిణులు తప్పనిసరిగా వినాలన్నారు. జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు, పోషకాహారం, బిడ్డకు ఇవ్వాల్సిన వ్యాధి నిరోధక టీకాల సమాచారం, కుటుంబ నియంత్రణ పద్ధతులను తెలియజేస్తారన్నారు. అలాగే టోల్ ఫ్రీ నంబర్ 14423 ద్వారా కూడా గర్భిణులు సమాచారం వినవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి డాక్టర్ జి.రోహిత, డీపీహెచ్ఎన్ వసంతలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, సీహెచ్‌వో కె.వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

పాశాలమ్మకు వెండి ఆభరణాల సమర్పణ



పాశాలమ్మకు వెండి కిరీటం సమర్పించిన భక్తులు



అమ్మవారికి ఆభరణాలను అలంకరిస్తున్న భక్తుడు

సీతానగరం: ముగ్గళ్ల గ్రామదేవత పాశాలమ్మకు భక్తులు గురువారం వెండి ఆభరణాలను సమర్పించారు. అమ్మవారి జాతర ఈ నెల 25 వరకూ జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన నాదెళ్ల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం భార్య రమాదేవి, కుమారుడు వెంకట శ్రావణ్ కేజీన్నర వెండితో రూ 1.80 లక్షలతో ఈ కిరీటాన్ని తయారు చేయించారు. అలాగే గ్రామానికి చెదిన తమ్మన వీర వెంకట సత్యనారాయణ కుమారుడు నాగ రవికుమార్, కుమార్తె బి.కనక దుర్గ రూ.30 వేలు విలువైన వెండి ఆభరణాలు (వడ్డాణం, కళ్లు, బొట్టు, ముక్కు పుడక)ను సమర్పించారు. ఈ ఆభరణాలను భక్తుల సమక్షంలో అమ్మవారికి అలంకరించారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 289 మంది హాజరు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షకు 289 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ బి.సుజాత తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరిగిన ఈ పరీక్షకు 300 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. అలాగే బుధవారం జరిగిన పరీక్షకు 281 మంది మాత్రమే హాజరయ్యారని చెప్పారు. పరీక్ష కేంద్రం టెస్ట్ సెంటర్ అడ్మిన్ ఈ.రమణారెడ్డి పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణతో సుస్థిర అభివృద్ధి

- సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్
- మొక్కలు నాటిన ఖైదీలు



సెంట్రల్ జైలులో మొక్కలు నాటుతున్న ఖైదీలు

కంబాలచెరువు: జీవ వైవిధ్య సంరక్షణతో సుస్థిర అభివృద్ధి సాధ్యమని కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని గురువారం సెంట్రల్ జైల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలులో జీవ వైవిధ్య సంరక్షణకు ఖైదీలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నిత్యం రాలిపోయే చెట్ల ఆకులు, పువ్వులను సేకరించి, సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నట్టు తెలిపారు. 200 ఏళ్ల పైబడి వయసున్న ఎన్నో చెట్లు ఈ కారాగారంలో ఉన్నాయని, వాటిని ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్నామన్నారు. ఉడతలు, ముంగిసలు, గోరింకలు, రామచిలుకలు, కాకులు, కోయిలలు, బాతులు వంటి ఎన్నో జీవజాతులు హాయిగా సంచరిస్తున్నాయన్నారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, శుభ్రతకు జైల్లో నిత్యం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం జైలు ఆవరణలో ఖైదీలతో మొక్కలు నాటించారు. ప్రాంగణంలో సంచరించే వేలాది పక్షులకు వరికంకుల కుచ్చులను వేలాడదీయించారు. వేసవి నేపథ్యంలో పక్షుల కోసం జైల్లో నీటితో పళ్లాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బి.రత్నరాజు, పర్యావరణ మిత్ర చిలుకూరి శ్రీనివాసరావు, జైలర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్తి లక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమితులైన మార్తి లక్ష్మి గురువారం ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దివాన్ చెరువులోని విజయభారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద గల కార్యాలయంలో కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మార్తి లక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన పదవి ద్వారా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజల పక్షాన పోరాటం చేస్తానన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ మార్తి నాగేశ్వరరావు ఉన్నారు.

మొక్కల పెంపకంలో మట్టికి ప్రత్యామ్నాయాలు



డాక్టర్ మనోజ్‌తో రత్నం అయ్యప్ప, పాలకవర్గ సభ్యులు

కడియం: నర్సరీ రంగంలో మొక్కల పెంపకానికి వినియోగిస్తున్న మట్టికి ప్రత్యామ్నాయాలు ఉన్నాయని కేరళకు చెందిన డాక్టర్ సీఎస్ మనోజ్ అన్నారు. సాయిల్ లెస్ మీడియాని స్థానిక రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, పాలకవర్గం దృష్టి సారించింది. దీనిలో భాగంగా దేశ వ్యాప్తంగా సాయిల్ లెస్ మీడియాల తయారీలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోకోపిట్, రైస్ రస్క్, పీట్‌మాస్ తదితర వాటిని మట్టితో కలిపి ఇప్పటికే రైతులు వినియోగిస్తున్నారు. పూర్తిగా సాయిల్ లెస్ విధానంలో మొక్కలు సాగుచేసేందుకు తగిన మీడియాను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేరళకు చెందిన డాక్టర్ మనోజ్, బృందం, సభ్యులు చర్చించారు. పైలెట్ ప్రాజెక్టుగా స్థానికంగా రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కొండేపూడి నాగు, రత్నం బాబ్జీ, పిల్లా శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠోత్సవం



మహాలక్ష్మీదేవి



విద్యాసరస్వతీదేవి



నవ చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ పరిధి ఆవ రోడ్డులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం మహాలక్ష్మీదేవి, విద్యాసరస్వతీదేవి విగ్రహాల ప్రతిష్ఠోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తిరుపతికి చెందిన పండితుడు విష్ణుభట్ల భీమశంకర సోమయాజులు నేతృత్వంలో నవ చండీ హోమాలు నిర్వహించారు. హోతా శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఆకట్టుకున్న నాటికలు

అనపర్తి: రామవరంలో బుధవారం ప్రారంభమైన నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయ సాంఘిక నాటకాల పోటీలో రెండోరోజు గురువారం ప్రదర్శించిన మూడు నాటికలు ఆహూతులను అలరించాయి. బతికుండగానే బాధ్యతగా వ్యవహరించడంలోనే నిజమైన ప్రేమ ఉందని చెప్పే ఇతివృత్తంతో ప్రదర్శించిన చీకటి పువ్వు నాటికను కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ప్రదర్శించారు. దీనితో పాటు మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం, గుంటూరుకు చెందిన అమృత లహరి ఆర్ట్స్ థియేటర్ వారి నాన్నా నేనొచ్చేస్తా నాటికలు ఆకట్టుకున్నాయి.

సర్పంచ్ చంటికి పురస్కారం



చంటికి పురస్కారం అందిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కడియం: మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి రాష్ట్ర ప్రభుత్వం అందించే జీవ వైవిధ్య పురస్కారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆయనకు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో జీవవైవిధ్య మండలి అధ్యక్షుడు ఎస్.విజయ్ కుమార్, కార్యదర్శి పి.రామకృష్ణ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు



పొట్టిలంకలో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

సీటీఆర్ఐ: హనుమజ్జయంతిని సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. తిలక్ రోడ్డులోని షిర్డీసాయి రామమందిరం ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తమలపాకులు, సిందూరంతో పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

- శానిటోరియం సమీపంలోని పంచవటి ప్రాంగణంలో గల వ్రతధర రామచంద్రమూర్తి ఆలయంలో స్వామివారికి అభిషేక సేవ, తమలపాకుల పూజ నిర్వహించారు.
- సీతంపేటలోని రామమందిరంలో హనుమద్ హోమం, పంచామృతాభిషేకాలు, సిందూర పూజ, లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వడమాల సమర్పించారు. 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.
- టీటీడీ కల్యాణ మండపం వద్ద గల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద భారీ అన్న వితరణ చేశారు.
- కంబాల చెరువు – దేవీచౌక్ సమీపంలోని సీతా రామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూరల్ మండలంలో..

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని భక్త ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతి బాలభక్త భజన సమాజం, గీతా వికాస్ భజన బృందం ఆధ్వర్యంలో స్వామికి తొలుత గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం పంచామృత ఏకవార అభిషేకాలు, నాగవల్లి సహిత సిందూర పూజలు, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, భక్తుల పేరిట గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- రాజవోలు గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి అన్నసమారాధన చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పంతామృతాభిషేకం, తమలపాకులతో పూజలు చేశారు.

- ఆల్కాట్‌తోటలోని శ్రీరామమందిరంలో ఆంజనేయస్వామి విగ్రహ వార్షికోత్సవం, హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిపారు.

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంతో పాటు, బుర్రిలంక, పొట్టిలంక, కడియపుసావరం, మురమండ తదితర గ్రామాల్లోని భారీ ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద వేద పండితుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

- కడియం, పొట్టిలంక, వేమగిరి గ్రామాల్లోని స్వామిని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు.
- పొట్టిలంక, కడియపుసావరం గ్రామాల్లో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఈలి గోపాలం ఉన్నారు.
- పొట్టిలంకలో సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.



సీతంపేట రామాలయంలో లక్ష తమలపాకుల పూజ



ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి



వ్రతధర రామచంద్రమూర్తి ఆలయంలో హనుమజ్జయంతి పూజలు

సినిమాలు



శ్యామల :	శుభం
సూర్యమినీ :	ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్ :	మిషన్ ఇంపాజిబుల్
స్వామి :	ఏస్
శివజ్యోతి :	హిట్–3
అనుశ్రీ :	ఫైనల్ డెస్టినేషన్
రాజా :	ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి :	నిశ్శబ్ద ప్రేమ
రంభ :	ఒక బృందావనం
మేనక :	వైభవం, ఎలెవన్
అప్సర :	సింగిల్
కుమారి :	వర్షం
అశోక :	కేసరి చాప్టర్–2
నామవరం	
వీఎస్ మహల్ :	ఏస్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఏస్, సింగిల్
కడియం	
వెంకటసూర్య :	ఫైనల్ డెస్టినేషన్